ప్రజాశక్తి





గురువారం 27 నవంబర్ 2025

శ్రీ సత్యసాయి

సోషలిజమే ప్రత్యామ్నాయం..!



'సోషలిజం ఔన్నత్యం- సామ్రాజ్యవాదం ప్రమాదం' అన్న అంశంపై జరిగిన సదస్సు సందర్భంగా అనంతపురంలో సిపిఎం ఆధ్వర్యంలో కొనసాగిన రెడ్‌షర్ట్స్ కవాతు


◆ అనంతలో కదంతొక్కిన కామ్రేడ్స్
◆ సిపిఎం ఆధ్వర్యంలో రెడ్‌షర్టు వలంటీర్ల కవాతు
◆ పాల్గొన్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు
◆ లలిత కళాపరిషత్‌లో 'సోషలిజం ఔన్నత్యం- సామ్రాజ్యవాదం ప్రమాదం' పై సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రెడ్‌షర్టు వలంటీర్ల కవాతులో అనంతపురం నగర వీధులు ఎరుపెక్కాయి. అక్టోబర్ విప్లవం గొప్పదనాన్ని చాటుతూ దేశవ్యాప్తంగా సాగుతున్న ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం నాడు అనంతపురం నగరంలో ఈ ప్రదర్శనను సిపిఎం చేపట్టింది. నగరంలోని ఆర్ట్సు కళాశాల మైదానం నుంచి టవర్‌క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతు సాగింది. ఈ కవాతులో సిపిఎం నాయకులు, కార్యకర్తలతోపాటు, అభిమానులు, పిల్లలు రెడ్‌డ్రస్సులు ధరించి ప్రదర్శనలో పాల్గొన్నారు. కవాతు ముందు భాగంలో వామపక్ష ప్రముఖ నాయకుల చిత్రపటాలతో రూపొందించిన ఎర్ర పతాకాన్ని చేతబట్టుకుని సిపిఎం నాయకులు, కార్యకర్తలు ముందుకు కదిలారు. తక్కినవారు ఎర్రజెండాలను చేతబట్టుకుని సిపిఎం జిందాబాద్, సోషలిజం అజయం అంటూ నినాదాల ప్రదర్శన ఆద్యంతం చైతన్య భరితంగా సాగింది. ఈ ప్రదర్శనలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులుతోపాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శి ఒ.నల్లప్ప, నగర కార్యదర్శి వి.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రదర్శన అనంతరం నగరంలోని లలిత కళాపరిషత్ హాలులో 'సోషలిజం ఔన్నత్యం- సామ్రాజ్యవాదం ప్రమాదం' అన్న అంశంపై జరిగిన సదస్సుల్లో బివి.రాఘవులు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

సోషలిజం కోసం ఐక్యంగా పోరాటం : బివి.రాఘవులు

తార తమ్యాల్లేని సమసమాజ నిర్మాణ సాధన కోసం పేదలంతా ఐక్యమై పోరాడాల్సిన అవసరముందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు పిలుపునిచ్చారు. అనంతపురం నగరంలోని సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో 'సోషలిజం ఔన్నత్యం-సామ్రాజ్యవాద ప్రమాదం' అన్న అంశంపై నగరంలోని లలిత కళాపరిషత్ హాలులో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. సోషలిజం ఔన్నత్యం 1917లో రష్యాలో జార్ చక్రవర్తిని పదవీచ్యుతిని చేసి కార్మికులు, కర్షకులు రాజ్యాధికారం చేపట్టాక జరిగిన మార్పులు తెలియజేస్తాయని వివరించారు. అసమానతల్లేని సమాజ నిర్మాణం జరిగిందన్నారు. అందరికీ విద్య, వైద్యం, ఉపాధి ప్రభుత్వమే కల్పించిందన్నారు. సాగుచేసుకునే వాడికి భూమి హక్కును కల్పించిందన్నారు. అమెరికా, ఇంగ్లండ్‌లోని 400 ఏళ్లనాటి పెట్టుబడీదారీ వ్యవస్థకు ధీటుగా 50 ఏళ్లలోనే అభివృద్ధి వైపు పయనించిందన్నారు. దీన్ని చూసి ప్రపంచం మొత్తం సోషలిజం వైపు మొగ్గుచూపుతుండటం చూసి భయపడిన పెట్టుబడీదారీ వ్యవస్థ అనేక కుట్రలు పన్నీ సోషలిస్టు ప్రభుత్వాన్ని కూలదోసాయని పేర్కొన్నారు. పెట్టుబడీదారి వ్యవస్థ ఎప్పుడూ ధనిక, పేదల మధ్య తారతమ్యాలను పెంచుతుందని చెప్పారు. అగ్రగామి దేశంగానున్న అమెరికాలోనూ ఈ తారతమ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. తినడానికి తిండి, గూడులేని వారు అక్కడా ఇప్పటికీ పది శాతం మందిపైగానున్నారని చెప్పారు. వీటికి ప్రత్యామ్నాయం చూపుతారనని ముందుకొచ్చినందుకే ఆ దేశంలో జోహరన్ మంమదానీ అనే సోషలిస్టు వ్యక్తి న్యూయార్క్ నగర మేయర్ కాగలిగాడని చెప్పారు. ఆయన్ను గెలవనీయకూడదని అనేక రకాలుగా పెట్టుబడీదారులు ప్రయత్నాలు చేసినా ఫలించలేదని వివరించారు. భారతదేశంలోనూ అసమానతలు, దోపిడీలేని సోషలిస్టు నిర్మాణం జరగాలని అనేక ఏళ్లుగా ఆకాంక్షిస్తున్నామన్నారు. ఆ ఆకాంక్షను నిజం చేసుకోవాలంటే పేదలంతా ఐక్యమై నిలబడాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. ఉపాధిలేమి, నిరుద్యోగం, నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు కలగాలంటే సోషలిజం ఒక్కటే మార్గమని సూచించారు. ఆ దిశగా ప్రజలు పోరాడాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న బివి.రాఘవులు

◆ సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ దేశంలో ప్రజా సమస్యలను ఈ పాలకులు పట్టించుకునే పరిస్థితుల్లో లేరని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలకు ప్రజా సంపదను దోచిపెడేట్ట పనుల్లో పాలకులు నిమగ్నమయ్యారన్నారు. ప్రధానమంత్రికి అత్యంత సన్నిహిత మిత్రుడైన గౌతమ్ ఆదానీ 2014కు ముందు వరకు దేశంలో వంద మంది సంపన్నుల జాబితాలో కూడా లేరని గుర్తు చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చిన ఈ 11 సంవత్సరాల్లో ఆయన ప్రపంచలోనే అత్యంత పది మంది సంపన్నుల జాబితాలో చేరిపోయారని తెలిపారు. విమానాశ్రయాలు, ఓడరేవులతోపాటు, గనులు ఇలా పెద్దఎత్తున ప్రజా సంపదను అతడికి దోచిపెట్టారని విమర్శించారు. మరోవైపు తినడానికి తిండలేని, గూడులేని సామాన్యులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలోనూ పెద్దఎత్తున భూదోపిడి సాగుతోందని విమర్శించారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో పది లక్షల ఎకరాల భూమిని కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టేందుకు ఈ ప్రభుత్వం సిద్ధమైందని తెలిపారు. కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టేందుకు ఈ ప్రభుత్వాలు ఉంటున్నాయన్నారు. ఒకవైపు రైతులు గిట్టుబాటు ధర లేక పంటలు పండించి కూడా నష్టపోయే పరిస్థితులు ఉంటున్నాయన్నారు. సరైన విద్యలేదు. వైద్యం లేక అవస్థలు పడుతున్నారన్నారు. ఈ బాధలన్నింటికీ పరిష్కారం పాలకులు మారితే కాదని ప్రభుత్వ విధానాలు మారాల్సిన అవసరముందన్నారు. పెట్టుబడీదారి వ్యవస్థకు ప్రత్యామ్నాయం సోషలిజమేనని, దాని సాధన కోసం అందరం కలసికట్టుగా పనిచేయాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు.



సదస్సుకు హాజరైన సిపిఎం శ్రేణులు, ప్రజలు

వామపక్ష ప్రముఖ నాయకుల చిత్రపటాలతో రూపొందించిన ఎర్ర పతాకంతో ప్రదర్శన

◆ సిపిఎం సీనియర్ నాయకుడు జి.ఓబులు మాట్లాడుతూ సోషలిజ సమాజం స్థాపనతోనే శ్రామిక వర్గానికి సంపద సమానత్వం లభిస్తుందన్నారు. ఆ దిశగా శ్రామిక కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ మేరకైన కార్మిక వర్గానికి హక్కులు అందడంలో ఐక్య పోరాటాలతోనే సాధ్యమైందన్నారు. సోషలిస్టు దేశాల్లో విద్యా, వైద్యం, ఉద్యోగం, ఆహార భద్రత కల్పించడంలో పాలక ప్రభుత్వాలు బాధ్యత వహిస్తాయన్నారు. ఎప్పటికైనా సోషలిజమే సమాజానికి రక్షణ అని పునరుద్ఘాటించారు.

◆ సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన పాలకులు కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తూ ఉన్న ఉద్యోగాలు తొలగించేందుకు కుట్ర చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. ఉద్యోగ ఉపాధి కల్పించడం పాలకుల బాధ్యత అన్నారు. ప్రభుత్వ రంగంలో పని చేస్తున్న కార్మికులను తొలగిస్తుండం అన్యాయంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, నాగేంద్రకుమార్, నాయకులు ఆర్‌వి.నాయుడు, వెంకటనారాయణ, చంద్రిక, అశ్విని, టి.రామాంజినేయులు, చంద్రశేఖర్‌రెడ్డి, నగర నాయకులు ముర్తుజ, వలి, ప్రకాష్, శివారెడ్డి, మసూద్, గోపాల్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో అభివాదం చేస్తున్న సిపిఎం నాయకులు

మాక్ అసెంబ్లీలో కోగిర విద్యార్థి

ప్రజాశక్తి-పెనుకొండ

భారత రాజ్యాంగ దినోత్సవం (సంవిధాన్ దివస్) సందర్భంగా రాష్ట్ర శాసనసభ ఆవరణలో బుధవారం నిర్వహించిన మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో రొద్దం మండలం కోగిర జడ్పీ హైస్కూల్ విద్యార్థి కె. జయవర్ధన్ పాల్గొన్నాడు. మాక్ అసెంబ్లీ అనంతరం మంత్రి సవిత విద్యార్థి కె. జయవర్ధన్ ను అభినందించారు. భవిష్యత్‌లో మరెన్నో విజయాలు సాధించాలని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న మంత్రులు నారా లోకేష్, సవిత, అనిత

సృజనాత్మక ఉపాధ్యాయురాలిగా నాగరత్న

ప్రజాశక్తి-హిందూపురం

పిల్లల భావ వికాసం, భావ వ్యక్తీకరణకు ఉపాధ్యాయులు నాగరత్న సృజనాత్మక విద్యను అందిస్తోందని మండల విద్యాశాఖ అధికారులు డాక్టర్ గంగప్ప, ప్రసన్న లక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ముద్దిరెడ్డిపల్లి పాఠశాలలో పుస్తక మిత్ర కమిటీ ఆధ్వర్యంలో షీరోస్ ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పిల్లలతో కథల పుస్తకాలు చదివిస్తూ, వారితోనే చెప్పిస్తూ గుణాత్మక విద్యసాధనకు నాగరత్న కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల ముద్దిరెడ్డిపల్లి క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు సుధామణి, పుస్తక మిత్ర హిందూపురం కమిటీ ప్రతినిధి రాజశేఖర్ రెడ్డి, నాగమణి, సిఆర్‌పి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



టీచర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

జిల్లా గోల్‌షాట్ బాల్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ పరిధిలోని ఎరుకలవాండ్ల పల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలలో బుధవారం గోల్ షాట్ బాల్ ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు ఆ క్రీడల రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు మనోహర్ రెడ్డి, ప్రసన్న కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ పాఠశాలల నుండి 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు ఎంపిక చేశామని, ఎంపికైన వారు ఈ ఏడాది డిసెంబర్ నెలలో ప్రకాశం జిల్లాలో జరిగే 3వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హరీష్ స్కూల్ ప్రిన్సిపల్ ఎం.ఎస్. కిరణ్, సుగుణమ్మ, రామాంజినేయులు రెడ్డి, జగదీష్ నాయక్, షబ్రీన్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లాజట్టుకు ఎంపికైన క్రీడాకారులు

మాజీ ముఖ్యమంత్రిని కలిసిన వాల్మీకి శంకర్

ప్రజాశక్తి - కొత్తచెరువు

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని, పులివెందులలో క్యాంపు కార్యాలయంలో వైసీపీ నాయకుడు వాల్మీకి శంకర్ కలిశారు. నియోజకవర్గంలో వైసిపి అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేస్తున్నామన్నారు. మీ అందరికీ పార్టీ అండగా ఉంటుందని ఆయన సూచించారు.

భూ రీసర్వే పనులు పూర్తి చేయాలి : జేసీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం మండలంలోని చిగిచెర్ల గ్రామంలో కొనసాగుతున్న రీసర్వే పనులను జాయింట్ కలెక్టర్ మౌర్య బుధవారం పరిశీలించారు. గ్రౌండ్ ట్రూతింగ్ నోటీసులు సక్రమంగా జారీ అవుతున్నాయా లేదా అన్న విషయాన్ని పరిశీలించారు. నిర్దేశించిన గడువులోపే గ్రౌండ్ ట్రూతింగ్ మరియు సర్వే పనులను పూర్తిచేయాలని సిబ్బందికి ఆదేశించారు. అవసరమైన పత్రాలు సమర్పిస్తే, భూ రికార్డుల్లో ఎటువంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితమైన ఎంట్రీలు జరుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేష్, తహశీల్దార్ సురేష్ బాబు, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.



మ్యాపును పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

బుక్కపట్నం చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్యే పల్లె సింధూర



ఆయకట్టు కాలువకు నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి

ప్రజాశక్తి- బుక్కపట్నం

బుక్కపట్నం చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే పల్లె సింధూర పేర్కొన్నారు. చెరువు పూర్తిగా నిండి మరువ పారుతున్న సందర్భంగా బుధవారం చెరువు లో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తో కలిసి గంగపూజ కార్యక్రమంలో పాల్గొని, తూముల ద్వారా సాగునీటి కాలువలకు నీరు వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుక్కపట్నం చెరువు 0.5 టీఎంసీలతో కళకళలాడుతోందన్నారు. ఈ చెరువు కింద ప్రత్యక్షంగా 3వేల ఎకరాలు పరోక్షంగా మరో 10వేల ఎకరాలు ఆయకట్టు సాగులోకి వస్తోందని తెలిపారు. కృష్ణా జలాలతో రైతులు బంగారు పంటలు పండించుకోవాలని సూచించారు. బుక్కపట్నం చెరువును పర్యాటక హాబుగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షులు నవీన్ కుమార్, ఉపాధ్యక్షులు సంజీవ రాయడు, మండల కన్వీనర్ మల్లి రెడ్డి , టౌన్ కన్వీనర్ ఎర్ర కేశప్ప, సింగిల్ విండో అధ్యక్షులు చెన్నకృష్ణ, నాయకులు సామకోటి ఆదినారాయణ, గంగాధర్, మాజీ సర్పంచి సాకే యశోద, జంగం వెంకటరాముడు, మాజీ ఎంపీపీ బాలు, సుధీర్, మంజు, సయ్యద్ భాష, ఇరిగేషన్ శాఖ అధికారులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణానికి చెందిన సప్తగిరి జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని సుబ్బిరెడ్డిపల్లిలో ప్రత్యేక శిబిరంలో భాగంగా సీజనల్ వ్యాధులపై ర్యాలీ నిర్వహించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. మంజునాథ్, ఏట బి.గంగిరెడ్డి ర్యాలీకి ముందు పర్యావరణ పరిరక్షణ, సీజనల్ వ్యాధులపై ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను అవగాహన కల్పిస్తూ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్లు టి.నాగేంద్ర, జి. ప్రకాష్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో కదిరి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కదిరి టౌన్

69వ ఎస్ జి ఎఫ్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలు రాజమహేంద్రవరం లో 23 నుండి 26 వరకు అంబేద్కర్ భవన్ లో జరిగాయి ఈ పోటీలకు రాష్ట్రం నుండి 13 జిల్లాలు నుండి అండర్ 14,17,19 విభాగాలలో బాల బాలికలకు పోటీలు జరిగాయి ఈ పోటీలలో అనంతపురం జిల్లా నుండి కదిరి కి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు ఈ పోటీలలో అండర్ - 14 45 కేజీలు విభాగంలో శ్రీ శాంతినికేతన్ పాఠశాలలో చదువుతున్న మొహమ్మద్ కైఫ్ కాంస్య పతకాన్ని, అండర్ - 17 74 కేజీల విభాగంలో జైన్ పాఠశాల విద్యార్థి రబ్బన్ కాంస్య పతకాన్ని, 78 కేజీల విభాగంలో శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థి మహమ్మద్ కైఫ్ బంగారు పతకాన్ని, 82 కేజీల విభాగంలో జైన్ పాఠశాల విద్యార్థి రెహన్ బంగారు పతకాన్ని సాధించారు. బాలికల అండర్ - 17, 60 కేజీల విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రోషిని సిల్వర్ మెడల్ సాధించారు. ఈఎస్‌జిఎఫ్ కరాటే పోటీలలో రాష్ట్రస్థాయిలో బంగారు పథకం సాధించిన విద్యార్థులు మహమ్మద్ కైఫ్, రేహాన్ పూణేలో జరిగే జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారు. శ్యాప్ డైరెక్టర్ రవీంద్రనాథ్, టోర్నమెంట్ ఆర్గనైజర్స్ ప్రసాద్ రావు, వ్యాయామ ఉపాధ్యాయులు,అడ్మిన్ ఈస్ట్ గోదావరి సెక్రటరీ భువనేశ్వరి రోటరీ క్లబ్ సభ్యులు చేతుల మీదుగా మెడల్స్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు హర్షణీయం

బీసీ సెల్ అధ్యక్షులు బండి నాగరాజు

ప్రజాశక్తి - రొళ్ల

కర్నాటక సరిహద్దు ప్రాంతమైన మడకశిర నియోజకవర్గం రెవిన్యూ డివిజన్ గా ఆమోదం తెలపడం హర్షనీయమని బీసీ సెల్ అధ్యక్షులు బండి నాగరాజు తెలిపారు. దీనికి కృషిచేసిన ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుకు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



బండి నాగరాజు

ముస్లిం మైనార్టీలకు 'కూటమి' అండ

ప్రజాశక్తి - కొత్తచెరువు

ముస్లిం మైనార్టీలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కొత్తచెరువు మండలంలోని మసీదులో పనిచేస్తున్న మత పెద్దలు నలుగురు ముతవల్లిలకు మూడు లక్షల అరవై వేల రూపాయల గౌరవ వేతనం చెక్ ను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో కలిసి,ఎమ్మెల్యే పల్లె సింధూర అందజేశారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ మేనేజర్ మాణిక్యం బాబా, మైనార్టీలు నూరు మొహమ్మద్, ఇమామ్, మైనార్టీలు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ. 6.27లక్షలు

ప్రజాశక్తి - మడకశిర టౌన్

మడకశిర మండలం భక్తరపల్లి లక్ష్మి నరసింహ స్వామి, జిల్లడుగుంట ఆంజనేయ స్వామి దేవస్థానముల శాశ్వత హుండీల ద్వారా రూ. 6.27 లక్షల ఆదాయం సమకూరింది. ఈ మేరకు బుధవారం హుండీ లెక్కిపు నిర్వహించినట్లు ఈవో నరసింహ రాజు, ఆలయకమిటీ ఛైర్మెన్ బి నరసిగౌడ్, ఉప కమీషనర్ ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ రమేష్ నాయుడు బ్యాంకు సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటి నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ హిందూపురంలో శాశ్వత గృహ నిర్మాణానికి స్థానిక టిడిపి నాయకులు బుధవారం భూమిపూజ చేశారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త పావులూరి శ్రీనివాసరావు, వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ బుధవారం భూమిపూజ చేశారు. పట్టణం పరిధిలోని కొట్నూరు చెరువు ఎదురుగా ఎకరా స్థలంలో ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, బాలకృష్ణ అభిమానుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచి మృతి

ప్రజాశక్తి - రొళ్ల

మండల పరిధిలోని గుడ్డుగురికి గ్రామపంచాయతీ మాజీ సర్పంచి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి(78) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి, కర్నాటకలోని తుమకూరు డిసిసి ఉపాధ్యక్షులు జి.జె రాజన్న మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు..

వీధి కుక్కల బెడద

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండలకేంద్రంలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారంపట్టణం లోని ఐటిఐ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు నారాయణస్వామినిపాతా గ్రామీణ బ్యాంకు సమీపంలో కుక్క దాడి చేసింది. ఈ దాడిలో గాయపడిన ఆయనను స్థానికులు కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

వంద శాతం ఉత్తీర్ణతే ధ్యేయం

ప్రజాశక్తి - మడకశిర టౌన్

సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాల్లో ఈ ఏడాది పదవ తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నామని సాంఘిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గంగాధర్ పేర్కొన్నారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రతిరోజు సాయంకాలం ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా కేంద్రం నుండి ప్రత్యక్ష శిక్షణ గల అధ్యాపకులచే ఆన్‌లైన్ ద్వారా ఆయా వసతిగృహాల్లో మానిటర్ ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తుందన్నారు. అన్ని వసతిగృహాల్లోనూ 100శాతం ఫలితాలు తీసుకురావాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు.

పచ్చదనం-పరిశుభ్రతపై శిక్షణ

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం గ్రామ సమైక్య లీడర్లకు వివోలకు ఎంపీడీవో వెంకటలక్ష్మి డిప్యూటీ ఎంపీడీవో ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో పచ్చదనం పరిశుభ్రత పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ గ్రామంలో శుభ్రత పాటించాలని, చెట్లు పెంచి పచ్చదనం పెంపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సమైఖ్య సంఘం అధ్యక్షులు, వీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాబయ్య ఉరుసుకు ఆహ్వానం

ప్రజాశక్తి-పెనుకొండ

దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన దర్గా హజ్రత్ బాబా ఫక్రుద్దీన్ శ్రీ బాబయ్య స్వామి 753 వ ఉరుసు మహోత్సవం హాజరుకావాలని జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్‌ను దర్గా మేనేజర్, మాజీ పీఠాధిపతి తాజ్ బాబా ఆహ్వానించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ను కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. అదేవిధంగా ఎస్పీ కార్యాలయంలోఎస్పీకి ఆహ్వాన పత్రిక అందించారు. అనంతరం పెనుకొండ ఆర్డీవో ఆనంద్ కుమార్ ను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నదీముల్లా(దాదు) తదితరులు పాల్గొన్నారు.

నేత్ర దానం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని శారదానగర్ కు చెందిన జుజారు మణి (40) గుండెపోటుతో బుధవారం మృతిచెందింది. మృతుని కుటుంబ సభ్యులకు విశ్వదీప సేవా సంఘం వారు నేత్రదానం పై అవగాహన కల్పించారు. కుటుంబ సభ్యులు సహకారంతో విశ్వదీప సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా అందత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డివై. కుళ్లాయప్ప కంటి రెట్రావైల్ సెంటర్ టెక్నీషియన్ జి.రాఘవేంద్ర తదితరులు మృతుడు మణి నేత్రాలను సేకరించారనివిశ్వదీప సేవా సంఘం ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, జుజారు రఘు, నాగార్జున, ఆదినారాయణ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్తపరీక్షలు

ప్రజాశక్తి - తనకల్లు

మండలంలోని సిజి ప్రాజెక్టు లో గల గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ధర్మరాజు ఆధ్వర్యంలో రక్తపరీక్షలు నిర్వహించారు. 365 మందికి రక్త గ్రూపులు, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహిచారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ టి. సూర్యనారాయణ రెడ్డి,ప్రిన్సిపల్ మేరీ మార్గరేట్, హెల్త్ అసిస్టెంట్లు మోహన్ రెడ్డి , ముసల్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

స్థల పరిశీలన

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని కట్టారుపల్లి క్రాస్ వద్ద ఉన్న కస్తూరీబాయ్ పాఠశాల వద్ద స్థలాన్ని ఆర్డీవో వివిఎస్ శర్మ బుధవారం పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూమి 1.72 ఎకరాలు ఉన్నాయి. పాఠశాలకు 1.20 ఎకరాలు కేటాయించాడు. మిగిలిన 42 సెంట్లు క్రాస్ వద్ద గ్రామ ప్రజలు శ్మశానానికి కావాలని కోరారు. పాఠశాలకు అదనపు గదులు మంజూరయ్యాయని ఆ గ్రామ ప్రజలతో చర్చించి సర్పంచి పంచాయతీ తీర్మానం చేసి తహశీల్దార్ బాబురావుకు ఆ తీర్మానాన్ని అందజేయాలని ఆదేశించారు. శ్మశాన వాటికకు మరొకచోట భూమిని మంజూరు చేస్తామని ఆ గ్రామ ప్రజలకు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఆర్ ఐ జాఫర్, వీఆర్వో కిష్టప్ప, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

ఆలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - చిలమతూరు

మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి గుడి నిర్మాణానికి డాక్యుమెంట్ రైటర్ సి మహేశ్వరప్ప, కుమారుడు సాయి మిథున్ 25 వేల రూపాయలు విరాళం అందజేశారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. మహేశ్వరప్ప మాట్లాడుతూ మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి గుడి నిర్మాణం చేస్తున్న అయ్యప్ప భక్తులకు తన వంతు సహకారం అందించాలని సంకల్పంతో తన కుమారుడు సాయి మిథున్ వివాహ మహోత్సవ సందర్భంగా గుడి నిర్మాణనికి అయ్యప్ప భక్తులకు 25 వేల రూపాయలు సహాయం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో గోల్డ్ షాప్ సునీల్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల కోసమే లేబర్ కోడ్‌లు

కార్మికుల హక్కులు కాలరాస్తున్న కేంద్రం

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

జిల్లాలో నిరసన కార్యక్రమాలు





కదిరి, పుట్టపర్తిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చేందుకు అత్యంత దుర్మార్గంగా కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్‌కోడ్లను తీసుకొస్తోందని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బివి.రాఘవులు విమర్శించారు. లేబర్ కోడ్స్‌ను వ్యతిరేకిస్తూ శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం నాడు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాఘవులతో పాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ పాల్గొన్నారు. కదిరి ఆర్అండ్‌బి అతిథి గృహం నుంచి కాలేజీ సర్కిల్, మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. అనంతరం సభను ఉద్దేశించి రాఘవులు మాట్లాడారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు లబ్ధి చేకూరే నిర్ణయాలు చేస్తోందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు లేబర్‌కోడ్లు అమల్లోకి వస్తే కార్మికుల జీతభత్యాలు, ఉద్యోగ భద్రత, రక్షణ, ఆరోగ్యం వంటి వాటిపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. కార్మికులు వారి న్యాయమైన హక్కుల సాధనకు సమ్మె చేసేందుకు కూడా వీల్లేకుండా చట్టాలు తేవడం అత్యంత దుర్మార్గం అన్నారు. కార్మికుల శ్రమను కార్పొరేట్లకు దోచి పెట్టేలా కేంద్రం నిర్ణయాలు చేస్తోందన్నారు. లేబర్‌కోడ్లను కార్మికులందరూ ముక్తకంఠంతో ఎదిరించి అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ కార్మికులకు తీవ్రం నష్టం చేసేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్‌లు తెచ్చిందన్నారు. వీటి వల్ల కార్మికులకు అన్యాయం జరుగుతుందని తెలిసినా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం దీనిని ప్రశ్నించకపోవడం సరికాదన్నారు. కార్మిక వ్యతిరేక నిర్ణయాలను కేంద్రం తీసుకుంటున్నా రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించకపోవడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల ముందు కార్మికుల హక్కులను కాపాడుతామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేబర్‌కోడ్లను ఎందుకు వ్యతిరేకించడం లేదన్నారు. లేబర్ కోడ్ల విషయంలో రాష్ట్రంలో పాలకపక్షం టిడిపి, జనసేన పార్టీలు మోసపూరితంగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి సైతం కార్మికల హక్కుల గురించి మాట్లాడకుండా మౌనంగా ఉండడం సరికాదన్నారు. కార్మికులకు అన్యాయం చేసేలా లేబర్‌కోడ్లను తీసుకుని వస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎల్.నరసింహులు, నాయకులు లక్ష్మీనారాయణ, సాంబశివ, బాబ్జాన్, జగన్మోహన్, రామ్మోహన్, ముస్తాక్, రాజారెడ్డి, గోవిందు, ఓడిసి రమణ, నాగరాజు, నాగిరెడ్డి వేమన్న, శివన్న, శంకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, అంగన్వాడీ నాయకులు సుజాత, ప్రమీలమ్మ, రంగమ్మ, రాధ, మోక్షప్రియ, లక్ష్మీదేవి, చంద్రకళ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు అంజినమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా గణేష్ కూడలి నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ కార్మికులు ఎన్నో సంవత్సరాల నుండి పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా నాలుగు కోడ్లుగా తీసుకొచ్చిందన్నారు. పెట్టుబడిదారులకు పారిశ్రామివేత్తలకు , మేలు చేకూర్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల నిర్లక్ష్యం వదిలి కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సీఐటీయు జిల్లా అధ్యక్షులు జడ్పీ, శ్రీనివాస్, శ్రామిక మహిళ సంఘం నాయకురాలు దిల్షాద్, వ్య కా స. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిరంగి ప్రవీణ్ కుమార్, సాకే వెంకటేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, కౌలు రైతు సంఘం కదిరిప్ప, సీఐటీయు జిల్లా కార్యదర్శులు పైపల్లి గంగాధర్, అంకె ముత్యాలు, పరిగి రాము. అంగన్వాడీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీదేవి, సిఎస్ శ్రీదేవి, కోడూరు రామచంద్ర ,సీఐటీయు నాయకులు ముకుంద, నాగరాజు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

లాభదాయకమైన పంటలు సాగు చేయండి



బుక్కపట్నంలో కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి, తదితరులు

ప్రజాశక్తి - బుక్కపట్నం

వ్యవసాయంలో లాభదాయకమైన పంటలు సాగు చేసి అధిక ఆదాయాన్ని పొందాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి రైతులకు సూచించారు. మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రాము నాయక్, తహశీల్దార్ నరసింహులు, వ్యవసాయ అధికారి నటరాజ్, వివిధ శాఖల అధికారులు, టిడిపి నాయకులు కార్యకర్తలు రైతు భరోసా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల : మండలంలోని దొడ్డేరి,రంగనపల్లి దొమ్మరహట్టి గ్రామాల్లో రైతన్నా..మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, కుంచిటిగా ఒక్కలిగా రాష్ట్ర సాధికార కన్వీనర్ వి.యం పాండురంగప్ప, టిడిపి మండల కన్వీనర్ జి.కె ఈరన్న టి.ఎన్.టి.యు.సి ప్రధాన కార్యదర్శి దొడ్డేరి ఉమేష్,సింగల్ విండో డైరెక్టర్ భరత్,యూనిట్ ఇంచార్జ్ మీసేవ వెంకటేష్ నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, డీలర్ల సంఘం గౌరవాధ్యక్షుడు పిల్లిగుండ్ల నరసప్ప,నియోజకవర్గ తెలుగు యూత్ ఉపాధ్యక్షులు తూబినకుంట నాగేంద్ర, క్లస్టర్ ఇంచార్జ్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం : మండల పరిధిలోని తమ్మడేపల్లి గ్రామ సచివాలయం రైతు సేవా కేంద్ర పరిధిలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల అధికారులు వెటర్నరీ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

గుడిబండ : గుడిబండలో రైతన్నా మీకోసంకార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీ నర్సప్ప క్లస్టర్ ఇంచార్జ్ చిత్ర శేఖర్ యాదవ్, న్యాయవాది శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

అగళి : మండల పరిధిలోని ఆలూడి గ్రామంలో బుధవారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాస్టర్ నరసింహప్ప,రాజు, జనసేన మండల అధ్యక్షుడు భాను ప్రకాష్, వీఆర్వో నరసింహమూర్తి, వీఆర్‌ఏ మంజునాథ్,రైతులు తదితరులు పాల్గొన్నారు

13న జాతీయ మెగా లోక్ అదాలత్

ప్రజాశక్తి-హిందూపురం

రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించడం కోసం అందరూ సహకరించాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సూచించారు. బుధవారం స్థానిక అదనపు జిల్లా కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మీ హారిక కోట, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్యతో కలిసి డిసెంబర్ 13న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్ పై ఏడీజే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీజే మాట్లాడుతూ పోలీసులు తమ తమ పోలీస్ స్టేషన్ల రాజీ కాదగిన కేసులను పరిశీలించి వాటిని పరిష్కరించేందుకు కషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీపీ నగేష్, సిఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం, ఆంజనేయులు, వివిధ స్టేషన్ల ఎఎస్ఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న న్యాయమూర్తులు

ఎల్ఐసి ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - కదిరి టౌన్

లేబర్ కోడ్‌లు కార్మిక వ్యతిరేకమని, కార్పొరేట్ సంస్థలకు మాత్రమే మేలు చేస్తాయని, వాటిని వెంటనే రద్దు చేయాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్, కదిరి శాఖ అధ్యక్షుడు రఘునాథ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యదర్శి ఎస్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎల్ఐసి కదిరి కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో జరిగిన నిరసన ప్రదర్శనలో వారు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

రెగ్యులర్ ఉద్యోగాల బదులు ప్రభుత్వం ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ ద్వారా 'హైర్ అండ్ ఫైర్' విధానం తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ రంగంలో, బ్యాంకుల్లో అప్రెంటిస్, తాత్కాలిక నియామకాలు పెరిగాయని అన్నారు. సమ్మెకు నోటీసు 14 రోజుల నుండి 60 రోజులకు పెంచి, కన్సిలియేషన్-ఆర్బిట్రేషన్ పేరుతో కాలయాపన చేసి సమ్మె హక్కును నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం మహిళలకు రాత్రి పూట పని చేయడానికి అవకాశం ఇచ్చి, వారి భద్రతకు పూచీ పడకుండా కార్పొరేట్లకు బానిసలుగా మారుస్తున్నారన్నారు. సామాజిక భద్రతపై మాటలు మాని, అందరికీ పాత పెన్షన్ స్కీం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వివాదాస్పదమైన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు ఎల్.శివభారతి, హేమావతి, నాయకులు నరేష్, ఆనంద రెడ్డి, నవీన్, వెంకట రమణ, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు అమరాపురం ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి - అమరాపురం

జాతీయస్థాయి బ్యాట్మింటన్ పోటీలకు అమరాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు నాగేంద్రప్ప ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడు నాగేంద్రప్పను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన మడకశిర నియోజకవర్గం నుండి పలువురు వివిధ క్రీడలలో రాణిస్తున్నారన్నారు. భవిష్యత్తు లో ఈ ప్రాంతం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కష్ణమూర్తి సింగల్ విండో అధ్యక్షుడు గణేష్ ప్రధాన కార్యదర్శి బాటా, నాగరాజ్ జై కుమార్ రఘు మాలింగప్ప,దాదు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల ఎస్టీ హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-హిందూపురం

గోరంట్ల ఎస్టీ వసతిగృహంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర మంత్రి సవితమ్మ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎరుకల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కేబీ శంకరయ్య కోరారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోరంట్ల ఎస్టీ వసతిగృహంలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుపేద గిరిజన బాలికలు వసతిగృహంలో అనారోగ్య పాలవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. గిరిజన బాలికలు అనేక ఇబ్బందులు పడుతున్నా అటు వసతిగృహ వార్డెన్ ఇటు జిల్లా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అక్కడ వాచ్ మెన్ తో వంటలు వండిస్తున్న గిరిజన శాఖ అధికారులు అరకొర సిబ్బందితో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు వీటిపై తక్షణమే కఠినచర్యలు తీసుకోవాలన్నారు. సత్యసాయి జిల్లా కలెక్టర్ వసతిగృహంలో ఒక రాత్రి బస చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి తోడు శ్రీసత్యసాయి జిల్లా మంత్రివర్యులు సవితమ్మ కూడా వీటి పైన వెంటనే విచారణ చేయించి అక్కడ తగిన సిబ్బందిని నియమించి రెగ్యులర్ వార్డెన్ ను నియమించాలన్నారు. నాసిరకం కోడిగుడ్లు, కాయగాయలు, నిత్యవసరాలు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకొని పిల్లలకు మంచి భవిష్యత్తును అందించాలని శంకరయ్య కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అంజినేయులు, పార్లమెంట్ అధ్యక్షులు వెంకటేష్, 20 వార్డ్ ఇన్‌ఛార్జి అంజినేయులు, మొలోజ్ శ్రీనివాసులు, మంజునాథ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్ సమస్యల ఫొటోలను ప్రదర్శిస్తున్న నాయకులు

అంగన్వాడీ కార్యకర్త ఆత్మహత్య

ప్రజాశక్తి - అమరాపురం

మండల పరిధిలోని వలస గ్రామానికి చెందిన అంగన్వాడీ కార్యకర్త పూజ(26) ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ ఇషాక్‌బాషా తెలిపిన వివరాలు.. పూజకు ఆరు సంవత్సరాల క్రితం రాఘవేంద్ర తో వివాహమైంది. అయితే ఆమె తరచుగా ఇతరులతో ఫోన్లలో మాట్లాడుతుండడంతో ఇది మంచి పద్ధతి కాదని కుటుంబ సభ్యులు మందలించారు. దీనికి తోడు వివాహమై ఆరు సంవత్సరాలు గడిచినా పిల్లలు కాలేదని పూజ మనోవేదనకు గురయ్యేది. ఈ నేపథ్యంలో ఈమె తన తండ్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సమాచారం తెలుసుకున్న మండలంలోని అంగన్వాడి కార్యకర్తలు వలసకు వెళ్లి ఆమె భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కలుషిత ఆహారం తిని 20 మందికి అస్వస్థత

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

మండల పరిధిలోని బత్తిని పల్లిలో ఓ శుభకార్యం లో పాల్గొన్న వారు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారు. 20 మందికి విరేచనాలు అయ్యాయి. వారిలో ఆందోళనకరంగా ఉన్న ఏడుగురునిఓడి చెరువు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగతా వారికి అక్కడే డాక్టర్ భాను ప్రకాష్ వైద్యం నిర్వహించారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ డిఎంహెచ్వో సునీల్, డిపిఎమ్ఒ నాగేంద్ర నాయక్, బాధితులు వారి ఆరోగ్య పరిస్థితి పరీక్షించారు. సమాచారాన్ని తెలుసుకున్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర వైద్యులతో ఫోన్లో మాట్లాడారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కమల్ రోహిత్, బాలాజీ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి తాడిమర్రి

మండల పరిధిలోని చిల్ల కొండయ్య పల్లి గ్రామంలో బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదాలు, సైబర్‌నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణవేణి యాదవ్, పోలీసులు అక్బర్, వీర, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చైతన్య స్వచ్ఛంద సంస్థపై అధికారులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులకు సేవలు అందిస్తున్న చైతన్య స్వచ్ఛంద సంస్థపై పలు ప్రజా సంఘాల నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. బుధవారం జిల్లా ప్రభుత్వ అసుపత్రిలో ఉన్నా ఎయిడ్స్ విభాగాన్ని అడిషినల్ జిల్లా వైద్యాధికారిణి అనుపమ జేమ్స్, జిల్లా మేనేజర్ వెంకటరత్నం పరిశీలిచారు. ఈ విషయం తెలుసుకున్న ప్రజా సంఘాల నాయకులు అక్కడికి వెళ్లి చైతన్య స్వచ్ఛంద సంస్థపై ఫిర్యాదు చేశారు. హిందూపురం ప్రాంతంలో గత కొన్ని సంవత్సరాలుగ చైతన్య స్వచ్ఛంద సంస్థ పేరుతో నిర్వహకులు గంగి రెడ్డి సేవలు చేస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారన్నారు. దీని కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వల నుంచి వస్తున్న నిధులతో పాటు ఇతర దేశాల నుంచి వస్తున్న నిధులను అడ్డంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. నిజమైన వ్యాధి గ్రస్తులకు స్వచ్ఛంద సంస్థ కనీస సేవలు సైతం చేయడం లేదని అన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేసి, సంస్థపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో అక్కడే ఉన్న స్వచ్ఛంద సంస్థ నిర్వహకులు గంగిరెడ్డి తమపైనే ఫిర్యాదు చేస్తారా అంటు ప్రజా సంఘాల నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కొద్ది సేపు వారి మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఉమర్ ఫరూక్, ఉదయ్ కుమార్, బి ఎస్పీ శ్రీరాములు, కొల్ల కుంట నాగరాజ్, ఊట్కూర్ నాగరాజ్, గిరిజన సేవా సమితి సభ్యుడు ఎరుకల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దండి

ప్రజాశక్తి - అమరాపురం

స్థానిక మండల ప్రజాపరిషత్ భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ఒక్కో రోజు యానిమేటర్లకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఈ ఓ ఆర్ డి ప్రసాద్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరుగుతోందన్నారు. ఇది ప్రజలకు అనారోగ్యానికి హాని కలిగిస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ చెట్లు నాటి కాలుష్యాన్ని నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హేమ మండల్ మహిళా అధ్యక్షురాలు కొర్రేవు సుజాతమ్మ, జెడ్ పి టి సి సోరక్క నరసింహమూర్తి, ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి , పంచాయతీ కార్యదర్శులు యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో కొత్తచెరువు విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - కొత్తచెరువు

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14 విభాగంలో జరిగిన హాకీ పోటీలలో కొత్తచెరువు బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని పివి భావన ప్రతిభ కనబరిచి రెండవ స్థానం సాధించిందని హెచ్ఎం నూర్జహాన్ తెలిపారు. ఈ నేపథ్యంలో భావనను హెచ్ఎంతో పాటు పీఈటీ సూర్యనారాయణమ్మ తదితరులు అభినందించారు.

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ దుర్మార్గం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ యత్నాలను కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని కాంగ్రెస్ నాయకులు తుంపర్తి పరమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ విధానం వల్ల సుమారు 60 ఏళ్లపాటు ప్రభుత్వ భూమి,వనరులు ప్రైవేటు సంస్థల చేతుల్లోకి వెళ్లి, వారికి ఆదాయవనరులుగా మారతాయన్నారు, వైద్య విద్య పూర్తిగా వ్యాపారపరమవుతుందన్నారు. విద్య, వైద్యం అనేవి ప్రభుత్వ ఆధీనంలో కొనసాగితేనే ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలోని శివానగర్ బ్రిలియంట్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు కళాశాల కరెస్పాండెంట్ సివి. శేషు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ సత్య చిన్నపిల్లల హాస్పిటల్ వారిచే ఈ వైద్య శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. ఈ శిబిరంలో డాక్టర్ విక్రాంత్, దంత వైద్యులు మనోజ్ కుమార్, డి ఏ ఓ నాగరాజు ఆచారి, ఆసుపత్రి సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

హాకీ క్రీడలో చిగిచెర్ల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మండల పరిధిలోని చిగిచెర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు హాకీ క్రీడలో ప్రతిభ కనపర్చినట్లు ఆ పాఠశాల హెచ్ఎం తిమ్మారెడ్డి, పిడి ప్రతాపరెడ్డి తెలిపారు. ఈనెల 22 నుండి 24 వరకు జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 14 బాల బాలికల పోటీలలో ఉత్తమ ప్రతిభ చూపి ఉమ్మడి అంతపురం జిల్లా జట్టు విజయం సాధించడంలో తమ పాఠశాల విద్యార్థులు ముఖ్య పాత్ర పోషించారని తెలిపారు. ప్రతిభా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిమ్మారెడ్డి, పిడి ప్రతాపరెడ్డి, పాఠశాల కమిటీ సభ్యులు , ఉపాధ్యాయులు అభినందించారు

ఉచిత కంప్యూటర్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-హిందూపురం

ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, హిందూపురం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణకు ఆసక్తి ఉన్న యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ నాయుడు సూచించారు. స్కిల్ హాబ్ సెంటర్ లో కస్టమర్ కేర్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ కోర్సు, కంప్యూటర్, సాఫ్ట్ స్కిల్ లో ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్, ఆ పైన చదివిన అభ్యర్థులు ఈ కోర్సులను నేర్చుకోవడానికి అర్హులన్నారు. నాలుగు నెలల శిక్షణ అనంతరం మంచి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు స్కిల్ హాబ్ కో ఆర్డినేటర్ కే.శివప్రసాద్ ను 9676706976 లో సంప్రదించాలన్నారు.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి - పరిగి

పరిగి మండలం నుండి పలువురు జనసేన పార్టీలోకి బుధవారం చేరారు. అనంతపురంలోని అహుడ చైర్మన్ వరుణ్ కార్యాలయంలో 108 నరసింహమూర్తి ఆధ్వర్యంలో జనసేన కండువా వేయించుకున్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శివ నారాయణస్వామి శ్రీధర్ పలువురు ఉన్నారు.

రాజ్యాంగ విలువల పరిరక్షణలో భాగస్వామ్యులు కావాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పెనుకొండలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

రాజ్యాంగ విలువల పరిరక్షణలో భాగస్వాములు కావాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. రాజ్యాంగ స్వీకరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పుట్టపర్తి శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రాజ్యాంగ దినోత్సవానికి సంబంధించిన కార్యక్రమాలు ముమ్మరంగా జరిగినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ నేతృత్వంలో అందరూ కలిసి రాజ్యాంగ పీఠిక పఠనం నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు కలెక్టర్ సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి క్రిష్టప్ప, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ దేవరాజు, విద్యార్థులు, విద్యార్థినులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రొళ్ల : భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలును యుటిఎఫ్ మడకశిర మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాలింగప్ప, జోగప్ప, మూడ్ల గిరియప్ప ఆధ్వర్యంలో మడకశిర పట్టణంలో నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కే. భూతన్న, కార్యదర్శి డి.నరసింహప్ప, నాయకులు నరసింహమూర్తి, నంజప్ప, ఓబులకృష్ణ, మహంతేష్, దేవరాజ్, సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్:నగర పంచాయతీ పరిధిలోని వెంకటరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ప్రధానోపాధ్యాయులు నారాయణ స్వామి, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ స్వామి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రాజ్యాంగాన్ని అర్థం చేసుకొని రాజ్యాంగ విలువలు కాపాడుకోవాలని, దేశ సమైక్యతకు కృషి చేసే విధంగా విద్యార్థులు ఎదగాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మాక్ అసెంబ్లీ గురించి తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ఆటపాటలతో వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గిరిజమ్మ, భారతి, కరుణ కుమారి, రేష్మభాను, ఆనందమ్మ, నరేష్ కుమార్, బాబు, చంద్రశేఖర్, ఎస్ఎంసి చైర్మన్ రవి పాల్గొన్నారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గిరిజమ్మ విద్యార్థులకు బహుమతులను స్వంతఖర్చులతో పంపిణీ చేశారు.

రొళ్ల : ప్రభుత్వ కార్యాలయాలు ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం అధికారులు ఉపాధ్యాయులు విద్యార్థులు కలిసి ఘనంగా నిర్వహించారు. అదేవిదంగా స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు మండల కేంద్రంలోని ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎస్.ఎన్ శ్రీధర్, ఆర్డీటీ ఎటిఎల్ ఓబులేసు, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అలునపల్లి శ్రీనివాస్, మడకశిర నియోజకవర్గం జనసేన సమన్వయకర్త రంగస్వామి, కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్.గౌడప్ప, వైసిపి జిల్లా ఎస్సీ సెల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొట్టుగురికి నాగభూషణ, మాజీ సర్పంచి నాగరాజు, నాయకులు అంజి, కృష్ణమూర్తి, రమేష్ నరసింహరాజు.తదితరులు పాల్గొన్నారు..

ఓబుళదేవర చెరువు : మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి బీసీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు షబ్బీర్ , తిప్పేపల్లి సర్పంచి రామచంద్ర రెడ్డి మీదుగా పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాగాళ్ల బావ న్న, వంచిరెడ్డి పల్లె కిష్టప్ప, కత్తి ఆనంద్, ధార శేఖర్, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : మండలంలోని దొడగట్ట గ్రామంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కెవిపిఎస్ రమణ ఆధ్వర్యంలో దొడగట్ట గ్రామంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను కాపాడుకుందామని, లేబర్ కోడ్ రద్దు చేసేంతవరకు పోరాటం కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి బాలు, డప్పు కళాకారుల సంఘం ఈశ్వర్, జయప్ప, శివప్ప,మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, గోపాలప్ప, దుర్గ, కవిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ :నేటి ఆధునిక భారతం లో రాజ్యాంగ విలువల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాలని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ హరీష్ బాబు అన్నారు. రాజనీతిశాస్త్రవిభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం(సంవిధాన దివస్)కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాంఘిక,సామాజిక పరిస్థితులకు అనుగుణంగా నేటి తరం రాజ్యాంగ విలువలకు బద్ధులై సన్మార్గంలో నడవాలన్నారు. ఐక్యు ఏసి కోఆర్డినేటర్ యశోదరాణి మాట్లాడుతూ రాజ్యాంగం భావనల సముదాయమే భారత రాజ్యాంగమన్నారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డాక్టర్. పియల్.కాంతారావు మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగ రచన లో కీలక భూమిక పోషించారని రాజ్యాంగ నిర్మాతగా దేశ చరిత్రలో నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నాగరాజు,మమత,లలిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలోభారత రాజ్యాంగ దినోత్సవం బుధవారంఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపల్ బషీర్ అహ్మద్, అధ్యాపకులు మూర్తి, లైబ్రరీ అధ్యాపకులు రామచంద్రయ్య ఎన్ఎస్ఎస్ పిఓలు శ్రీలేఖ, శివన్న, రవికుమార్, ఆర్ఆర్ సి జయప్రకాష్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం : మండల కేంద్రంలో దళిత నాయకులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి సందర్భంగా పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

లేపాక్షి : మండల పరిధిలోని తహశీల్దార్ కార్యాలయం, గ్రంధాలయంలో బుధవారం రాజ్యాంగం దినోత్సవం నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సౌజన్య లక్ష్మి, ఎంపీడీవో నరసింహ మూర్తి, ఎస్ఐ నరేంద్ర, డిప్యూటీ తహశీల్దార్ కుమార్ రెడ్డి, గ్రంథాలయ అధికారి మల్లికార్జున, సిబ్బంది గ్రంథాలయ పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

అగళి :అగళి తహశీల్దార్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను తహశీల్దార్ సుబ్బారావు, సిబ్బంది జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చంద్రశేఖర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో బుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఇన్సెపెక్టర్ చంద్రమణి, ఎస్ఐ చాంద్ బాషా, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

హిందూపురం రూరల్ : రూరల్ పరిధిలోని ఎల్.ఆర్.జి విద్యాలయంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : ధర్మవరం మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సాయి మనోహర్, మండల్ పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: మండల కేంద్రంలోని సచివాలయం1 నందు సర్పంచి బి. పంచ రత్నమ్మ, సెక్రటరీ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ నూరుద్దీన్, వెటర్నరీ అసిస్టెంట్ రాహుల్ నాయక్, మహిళా పోలీసు మైమూన్, డిజిటల్ అసిస్టెంట్ మెహతాజ్, హార్టికల్చర్ హరిత సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పరిగి : మండల కేంద్రంలో రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని వివిధ సంఘాల నాయకులతో పాటు పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు సూర్యనారాయణ, వెంకటేష్, బాలాజీ, మాజీ ఎంపీపీ గోవిందప్ప, మద్దిలేటి రామాంజి, రామదాసు, నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని ధనాపురం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయ ఆధ్వర్యంలో నిర్వహించారు.

గాండ్లపెంట : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారంభారత రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రధాన ఉపాధ్యాయుడు టీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్ అలీ, చిన్నప్పయ్య, శ్రీధర్ రెడ్డి, రాజరత్నం, లక్ష్మీనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

ముదిగుబ్బ : మండలంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక హైస్కూల్ సర్కిల్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం దగ్గర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో టిడపి క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్, మండల విద్యా అధికారులు రమణ, వెంకటా చలపతి, అంబేద్కర్ పరిరక్షణ సమితి రంగనాయకులు, చంద్ర,నూర్ మహమ్మద్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజశేఖర్ బాబు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కదిరి పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లాలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు . ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం :భారతదేశంలో ఎలాంటి చట్టాలు రూపొందించినా అందుకు మూలం భారత రాజ్యాంగమేనని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అదనపు జిల్లా కోర్టు ఆవరణలో ఏడిజె తో పాటు న్యాయమూర్తులు వెంకటేశ్వర్లు నాయక్, లలిత లక్ష్మీ హారిక కోట, రమణయ్యలు రాజ్యాంగ పీఠిక ఆధారంగా రూపొందించిన ప్రతిజ్ఞను వివిధ న్యాయ స్థానాల సిబ్బందితో చేయించారు. దీనికి తోడు బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వన్నేరువప్ప, రామచంద్రప్పల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం న్యాయవాదులకు డైరీలు, లాక్ సంబంధించిన పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది సి. రామచంద్రారెడ్డి, సిద్దు, మాజీ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇందాద్, న్యాయవాదులు డి. శివశంకర్, ఏ. నాగరాజు రెడ్డి, రవికుమార్, రవిచంద్ర, శ్రీనివాసరెడ్డి, గోపాల్, హిదాయతుల్లా ఖాన్, ఫణి కుమార్, మహిళా న్యాయవాదులు నవేరా, రసూల్ బి, పవిత్ర పాల్గొన్నారు.



రొద్దంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నాయకులు



హిందూపురంలో కేక్ కట్ చేస్తున్న న్యాయవాదులు